# పల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకతలు

నేనూ, అంతోని గాడూ కనిగిరికి పోదామని రోడ్డు మీనకి నడుసుకుంటా బోతావున్నం. మిట్ట మద్దినేల ఎండకి తలకీ, కాల్లకీ ఉడుకు తగల్తా వుంటే ఇస్సో ఉస్సో అంటా నడుస్తున్నం. సందుమూల దిరిగే శేకి గంగిరెద్దులాయన ఎద్దుని ఆడిపిస్తా కానొచ్చినాడు.

# కూటికి కులముంటదా?

"సీతమ్మా! రాముడి కాడకి బోతవా? వనవాసం బోతవా?" అని అడుగతావుంటే ఎద్దు తలాడిస్తా వుండది. సిన్నా సితకా పిలకాయలంతా గంగిరెద్దు చుట్టూతా సేరి కేరింతలు కొడతావుండరు.

మేము గూడా నవ్వుకుంటూ రోడ్డుమీనకి బొయ్యి సెట్టుకింద కూసున్నం. ఎం చేవుటికీ బస్సు రాలా. ఇంగ నాకు ఓపిక జచ్చి "పెయానం మానుకుందం" అంతోనీ అన్నా.

"నేను గూడా అదే సెబదమనుకుంటుండా బావా! ఇంగ నువ్వే అంటివి. కొంచేపు రోశెత్త ఇంటికి బొయ్యి కూసుందం పా" అన్నడు.

సరే అని మేమిద్దరం రోశెమ్మింటికి బోతా వుంటే చింతసెట్ల కింద సిన్న సిన్న గుడిసె లేసుకోని వుండారు కొంత జనం. నాలుగెద్దులు కట్టేసుండాయి. ఆడోల్లంతా కింద గోతాలు పరుసుకోని పానుకోముండారు. వోల్ల పక్కల్లోనే కుక్కలు గోడా పాముకోనుండాయి.

"యాందిరా, అంతోనీ! యీల్లంతా ఎవురు? మనూరోల్ల మాదిరిగా లేరే?" అవన్నా.

"ఇందాక మనం జూల్లెదంట బావా! గంగెద్దులాయన్ని, వాల్లోల్లే ఈల్లంతా, అవ్వడవ్వడొచ్చి ఈడ గుడిసె లేసుకోని కొన్ని దినాలుండి పోతరు" అని జెప్పినాడు వాడు.

"సరేలేరా కొంచేపు ఈడ కూసోని బోదం" అని మేమిద్దరం ఆ సెట్ల కిందకి బోయినాం.

మమ్మల జూసి యిద్దరు ముగ్గురాడోల్లు లేసి కూసున్నరు.

"మేమీ వూరోల్లమేలే! వూరికినే వొచ్చినాం" అన్నడు అంతోని.

ఆడనే నీడ పట్టున బొంతరాల్ల మీన కూచున్నం. నేనేమాట గలిపి ఒకామెని అడిగినా "ఏవమ్మా! మీదే వూరు? పాపం, ఈ యెండలకి పిల్లా జెల్లాతో అగసాట్లు బడతావుండరే" అని.

"ఆ మాది ఇమ్మడి సెరువు సారూ! మమ్మల ఎర్రగొల్లోల్లు, దాసుల్లు, యాదవులు అంటుంటరు. ఏదయ్యా, బూమీ, వుట్టలేక అవ్వజేసుకొని బతుకుతున్నం."

మీ వూళ్లో మీకు ఇల్లు గిల్లూ లేదా?" అవడిగినా.

"యాడుంది? మా వూళ్లో రెడ్డి, కర్ణం, మంచోల్లు గాక ఇట్టనే అగసాట్లు బడతా వుండం. ఇట్టనే పిల్లలం, తల్లులం వూరూరు తిరుక్కుంటా సంచారం సేస్తా వుంటం.

వానాకాలమొస్తే, వూరికి బొయ్యి రెండు మూడు నెలలు ఆడ కాపరం జేసేది. రెడ్ల కాడ, వడ్డీలకి డబ్బులు తెచ్చుకోని వండుకోని తినేది. మల్లా వూల్లు దిరిగి డబ్బులు సంపాయిచ్చుకోని, కడువు సేత్తో బట్టుకోని తినీ తినక ఆ డబ్బులు దీసకబోయి వడ్డీలు గట్టుకునేది. అప్పలు దీర్చేది.

మా మొగోల్లు ఎద్దుని దీసకబొయ్యి మేలం వాయించ్చుకుంటా, సన్నాయి వాయిస్తా, ఇల్లిల్లూ దిరిగేదీ బిచ్చం బెట్టిచ్చుకొస్తరు.

మా వూల్లో మాకు అయిదురుగు అన్నదమ్ముల్లకి కలిపి ఒకటే గుడిసి. ఏ రెడ్డీ మాకంత వేలియ్యలా! వోల్లు దేశం బొయ్యి బాగా డబ్బులు సంపాయిస్తరు, వోల్లకేంది యిచ్చేదీ అంటరు.

మా పరిస్తితి మాత్తరం ఎవురుకీ దెలియదు. సోలడు గింజలు దొరికిన రోజు తినటం లేకుంటే గమ్మున వస్తులుండటం."

ఇట్టా సెపతా వుంది ఒక పెద్దామె మాకు. అంతలోకి పైటా పావడా కట్టుకోనున్న ఒక పిల్ల మా పక్కన్నే కూసోని ఇంగో సిన్నపిల్లతోటి దాయాలాట గావాల ఆడతావుంది.

ఆ పిల్లని సూపిచ్చి ఇంగో వడి ఒగిసామె నాతో సెబతా వుంది.

"వొచ్చే యేడన్నా ఆ పిల్లకి పెల్లి చేద్దామనుంది నాయనా, ఎంత లేదన్నా మూడో, నాలుగో ఏలు గావద్దా?" అన్నది.

"మీలో కట్నాలుంటయ్యా? ఏ మాతరం ఇస్తరు?" అవడిగిండు అంతోని.

ఆ ఏదో, కొద్దో గొప్పో వుంటే వుంటది. లేకుంటే లేదు. వున్నోల్లు ఎయ్యో ఎయ్యిన్నరో ఇస్తరు. లేకుంటే ఓలి గట్టిచ్చుకుంటరు. ఇంటి ఆడపిల్లకి సొత్తులు బెట్టలేక ఇంట్లో బుట్టిన అవుదూడుంటే ఇస్తరు.

—ఎండ్లూరి సుధాకర్

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 11.10.96

దీనికి తోడు నాకు ముగ్గురన్నదమ్ములు. ముగ్గురికీ సేతబడి జేసిన్రు. వేనైతే నాలుగుపార్లు నచ్చి బతికిన. రెండు గొడ్లు నచ్చినయ్యి. నాకు వైద్దిగం జేసుకోను ఎన్నో వూర్లు తిరిగినా,

మేం బీదోల్లం సామీ! బిచ్చమడుక్కోని తినేవోల్లం. మా కాడ డబ్బులొండొద్దా" అన్నది సెంగుతో కళ్లొత్తుకుంటూ.

ఇంగ నాకు బాదేసి మాట మార్చినా, 'మీరు మాంసం తింటారా?" అన్నా

"తింటం, కోడి, గొర్రి, మేకలు అన్నీ తింటం. మద మాంసం తప్పనిచ్చి అన్నీ తింటామయ్యా" అని సెబతా వుండంగా ఇందాక మేము రోడ్డుమీనకి బొయ్యేటప్పుడు సూసిన గంగెద్దులాయన ఎద్దుని తోలుకుంటూ మాకాడ కొచ్చిండు.

ఎద్దుని సెట్టుక్కట్టేసి దానికంత గడ్డేసి నీల్లు బెట్టిండు. మా కాడ కూసోనున్నామి ఆయన బార్యంట. ఆమిని బిలిసి జోలీ లోనించి బియ్యం మూట, సొద్దల మూట, రాగులు మూట తీసిచ్చిండు. అయ్యన్నీ ఆయాల అడొక్కొచ్చిన గింజలంట. ఇంగో స్టీలు టిపినీ దీసి "ఇదుగో, రెడ్డమ్మిచ్చిన సంకటి ముద్ద!" అని పెద్దంగా అరస్తా జెప్పిండు.

ఆ మాటకి నాకాడ కూసున్న పెద్దామి లేసి "నిన్న నమ్మేదానికి లేదురో! అది రెడ్డమ్మ కాడ దెచ్చినవా? మాల మాదిగోల్ల కాడ దెచ్చినావా?" అనడిగింది.

"ఈల్లకాడ దెస్తే తప్పేందంటా? మాల మాదిగల కాడ బియ్యమూ, సొద్దలూ బిచ్చం దెచ్చుకుంటే తప్పలేదు గాని అన్నమూ, సంకటీ తెస్తే యాంబోతందీ?" అనడిగినాడు నవ్వతా ఆ గంగెద్దులాయన.

"అదేందీ? ఎవురన్నమైతే యాందీ?" అనడిగిండు అంతోని.

"అది మా కట్టుబాటు సామీ! మాల మాదిగోల్ల కాడ బిచ్చం బెట్టిచ్చుకుంటం గానీ అన్నం తినం" అన్నది ఆయన బార్య.

ఇంగ నాకు బలే యిచ్చింతరం అయిపొయ్యింది. ఇంచేవూ కూటికీ నీల్లకీ గతిలేదని సెప్పె, అయిదుగురన్నదన్నములకి కలువుకోని ఒకటే గుడిసని సెప్పె, దొరికితే తింటం, లేకుంటే పస్తులుంటమని సెప్పి గుడ్లకి నీల్లు కుక్కుకునె. యాన్నో అంత ముద్ద దొరికితే సాల్లే రోజులెల్ల మారిపోతయ్యి అనుకో బల్లే! అని తలపోస్తావున్నా.

"మ్మేయ్! సంకటి ముద్ద తీసి వుట్టె మీన బెట్టు. కుక్కలు తింటయ్యేమో" అన్నాడాయని బార్యతో.

"మన కుక్కలు కాపలా వుండంగా వూళ్లో కుక్కలొచ్చి మన కుండలు దొల్లిస్తయా" అన్నది పెద్దామి.

"ఈల్లకీ, ఈల్ల సామాన్లకీ కాపలా వుండేదానికి గావాల బావా! ఇన్ని కుక్కలు సాకతా వుండారు" అని నాతో అంటున్నడు అంతోని గాడు.

వాడి మాటలకి ఆమె మాతో అంటున్నదీ. "అవునయ్యా! మాకు ఇల్లూ వాకిలీ లేకపాయె. ఇట్టనే సంచారం జేస్తా యాడంటే అడ సెట్ల కిందనే కాపరాలు జేసేటోల్లం గదా! రావంత సేవు కునుకు దీసినా ఎటన్నా బొయ్యినా మా కూటికీ గుడ్డకీ ఈ కుక్కలే కావలా కాస్తాయ్యి. మా బిడ్డలతో సమానమయ్యా ఇయ్యి" అంటా ఎంతో మురుసుకుంటా జెపతా వుంది.

"బావా! ఇంగ పోదంపా' ఈల్లు కుక్కలకిచ్చే మరియాద గూడ నీకు నాకూ ఇచ్చేట్టుగ లేరు" అని నాతో మెల్లంగ అంటుడడు.

"అవున్రా, నల్ల నాయాలా! బాగా జెప్పినవు. ఈ దేసంలో కులాలుండేది మనసులకే గానీ కుక్కలకి గాదుగా!" అనన్నా.

"అంతేలే బావా! ఇస్వామిత్రుడు కుక్క కూర దిని గూడా మునిగానే వుండి పొయ్యె. మనం మాత్రం గొడ్డుకూర దిని ఇనుమంటోల్ల ముందట కులం జెడితిమి" అనుకుంటా గూడెం దారి బట్టినం.

●●

